# దగాలో దర్జా

బండి దిగి చిన్న సూటు కేసు ఒకటి చేతపట్టుకొని హడావుడిగా బ్రిడ్జి దిగి బయటకు వచ్చాడు స్వామినాయుడు. నోట్లో వెలుగుతున్న సిగిరెట్టును రెండువేళ్ళ మధ్య పట్టుకొని నెమ్మదిగా నొక్కి ఒక్కసారి గట్టిగాపీల్చి విసురుగా ముందుకు పారేసి గబగబా నడిచి ఒకసారి వెనుతిరిగి బూటు మడిమతో సిగిరెట్టు ముక్కను త్రొక్కి ముందుకు వెళ్లాడు ఎడమచేతిలో ఉన్న సూటుకేసును కుడిచేతిలోకి మార్చుకొని ఒక క్షణమాగి నాల్గువైపులా చూచాడు. ఒకరిద్దరు రిక్షావాళ్ళు అతని ప్రక్కగా వచ్చి బండ్లాపుకొని బేరం లేదనిపించుకొని వెళ్లిపోయారు మరో నాల్గు అడుగులు వేసేసరికి మలుపు తిరగవలసి వచ్చింది అక్కడ మళ్లీ ఆగి అటూ ఇటూ చూచాడు మిత్రులెవరైనా కన్పిస్తారేమోనని. ప్రక్కనుంచి బాబూ గుడ్డిదాన్ని ఒక్క కానీ పారెయ్యండి బాబూ!'' అనీ, 'దానంచేసే చెయ్యి దాగబోదు బాబయ్యా' అనీ ఉండి ఉండి అరుస్తున్న కేక వినపడింది. అతను ముందుకు అడుగు వెయ్యబోతూ "పాపం! వీళ్ల సంగతి ఎవరూ పట్టించుకోరుగదా!" అనుకుంటూ వెనక్కువచ్చి క్రొత్త బుష్‌కోటు జేబులోనుంచి ఒక అర్దణాబిళ్ల తీసి గ్రుడ్డిది పరుచుకున్న పాతగుడ్డపై వేసి ఆమె అందించే వెయ్యి దీవనల్లో ఒకటైనా వినకుండా మలుపు తిరిగి చరచరా నడిచి ఆ మలుపు వంతెన దాటి హోటల్‌కు వెళ్ళి కాస్త తేలికగా ఘనపదార్థాన్ని అందుకొని కాఫీ చప్పున గొంతులో పోసుకొని మళ్ళీ నడవడం మొదలుపెట్టాడు. నడకవేగం తగ్గింది.

"వస్తానన్న మనిషి వస్తే ఎంత బాగుంటుందీ" అని అనుకుంటూ మరో సిగిరెట్టు ముట్టించాడు.

అతని మిత్రుడు మూర్తి స్టేషకు వచ్చి కలుసుకునటానని వ్రాశాడు. అతనితో కొంతసేపు సరదాగా గడిపి కొన్ని విషయాలు మాటాడి వెళదామను కొన్నాడుస్వామి. మరో రెండుగంటల్లో బయలుదేరే ప్యాసెంజరులో ఆతను మదాసు వైపు ప్రయాణం చెయ్యాలి.

మరో పది అడుగులు నడిస్తే పోస్ ఎదురవుతాడేమోనని మెల్లగా ఆలోచిస్తూ నడిచాడు స్వామి.

"నమస్కారమండీ!" అన్నాడు పేవ్‌మెంటుమీద కొంచెం నిలబడ్డ ఒకవ్యక్తి. కట్టుకున్న ధోవతీ, వేసుకొన్నచొక్కా కొంత మాపు కన్పిస్తున్నా ముఖంలో కొంత మొరటుతనం తొంగిచూస్తున్నా ఆ వ్యక్తి స్వామికి "ఏమో పెద్దమనిషేలే అనిపించాడు. అదీకాక పైన కండువా వేసుకునేవాళ్లను చూస్తే స్వామికి గౌరవం మొదటినుంచీ. అందులోనూ ఆ వ్యక్తి అతని కంటే చాలా ఎత్తుకూడానూ. అందువల్లనే స్వామి ఆగి, 'ఎవరబ్బా ఈయన' అనుకుంటూ ప్రతినమస్కారం చేస్తూనే ఆయన వంక పరీక్షగా చూస్తూ జ్ఞాపకం చేసుకొంటున్నట్లుగా చూచాడు. ఒకవేళ మూర్తి నెరిగినవాడేమో తన్ను అతనితో ఏమైనా ఒకటి రెండుసార్లు చూచివున్నాడేమో అని కూడా అనుకొన్నాడు స్వామి.

మొదట కొంచెం చిరునివ్వుతో విప్పుకొన్న ముఖం అంతలో మెల్లగా దీనంగా మారిపోయింది.

"క్షమించాలి. తొందరగా వెళుతున్నట్టున్నారు... అని ఆగాడాయన.

"అబ్బే పెద్ద తొందరేం లేదు లెండి—ఇంతకూ నాకు జ్ఞాపకం రావడంలేదు మీరూ..."

"మీరు నన్నెరుగరులెండి అయినా సాహసంచేశాను మన్నించాలి."

"అయ్యో! అవేం మాటలండీ నేను చిన్నవాణ్ణి అసలూ..."

"ఆదే మనవి చేసుకొంటూ—చూశారూ మిమ్మల్ని చూడంగానే వయస్సులో చిన్నవారైనా చాలా బుద్ధిమంతుల్లాగానూ, కష్టసుఖాలు ఎరిగినవారులాగానూ కన్పించారండీ..." అని ఆగా డా నూతన వ్యక్తి

స్వామికి అనుకోకుండానే ఆయన మాటలకు కొంత ఆనందం కలిగింది.

"ఆహా—అయితే?" అన్నాడు స్వామినాయుడు చిరునవ్వుతో-కొంత గర్వంగ.

"అందువల్లనే ధైర్యం చేసి పూర్వం ఎరక్కపోయినా ఓ విషయం మనవిచేసుకొందా మని ఆశపడుతున్నానండీ..."

సరె సరె ఇంకేం. మా అబ్బాయి బళ్ళో చదువు కొంటున్నాడు-మా ఇంటావిడ అసుపత్రిలో పురుడు పోసుకుంటున్నది. కొంచెం దయ వుంచి పీలైతే చెయ్యండి!" ఇంతే అయివుంటుం దీయనగారి వ్యవహారం అనుకొన్నాడు స్వామి. అల్లా అనుకొన్నాకూడా అతను మరోక్షణం "అ చెప్పండి విషయమేమిటో?" అని అడిగాడు ఆయన చెప్పబోయే విషయం తనకు బాగా తెలుస్తున్నట్లుగా చూస్తూ.

"ఏంలేదండీ—నేను నిజంచెప్పాలంటే ఒకరి దగ్గర మనవి చేసుకోవాల్సిన మనిషిని కాదండీ. కాని కాలం అల్లా వచ్చింది. అనుకోని చిక్కు ఒకటి వచ్చి పడ్డది."

ఇంతేనా—అసలు మావాళ్లు చాలగొప్పవాళ్లు మా తాతగారి కాలంలో గుమ్మడికాయంత బంగారం ఇంట్లోపడి మూల్గుతూఉండేది.

కాని ఆయన గారి అవసానకాలంలో ఒక శునక మొకటి...ఇంతే అయి వుండాలి ఈయనగారి తంతు" అనుకొన్నాడు స్వామి

"ఏమిటీ ఇంతకూ," అన్నాడు స్వామి కొంచెం చిరాకు వ్యక్తపరుస్తూ. "ఓ తెలుసులే పోవయ్యా" అని తొలగి వెళ్ళిపోయే స్వభావంకాదతనిది.

"చిత్తం మీ రలా సెలవిస్తే నే ననలు మాట్లాడలేను. నే నెంత సిగ్గుపడి, బాధపడి మీకు మనవిచేద్దామని అనుకున్నానో మీకర్థం కాములెండి. నేనేదో..." అని ఆ వ్యక్తి దీనంగా, బాధగా చూచాడు స్వామి సగం కరిగాడు.

ఆయన చూపులో ఆ మాటదే తీరులో ఏదో విశేషం ఉంది స్వామికి ఆ వ్యక్తి యందొక విధమైన నమ్మకం కలిగించింది.

"ఏమిటండీ అని అడిగాడు మర్యాదగా కొంత సానుభూతి పూర్వకంగా.

మాదసలూ రాజమండ్రి—అక్కడ నేనూ ఏదో వున్నంతలో గౌరవంగా బ్రతుకుతున్నాను రెండెకరాల పల్లపుపొలం వున్నా చిన్న ఉద్యోగం కూడా చేశాను ఉద్యోగం చేస్తున్న రోజుల్లో ఎంత నీతిగా వున్నా ఏదో పైడబ్బు వస్తూనే వుండేది—మీ ముందు ఆబద్ధాలు చెప్పడం దేనికీ ఆ బాపతు కొంత సంపాదించిన మాట వాస్తవమే అయితే చూశారూ ఎవర్నీ పీడించనూ — లేదు ఆన్యాయంచేసి పుచ్చుకోనూ లేదు—పిల్లలు కలవాణ్ణి అలా చేస్తానా...!" ఏమిరా ఈ గోడవంతా! ఎందుకీ ప్రసంగం అనుకుంటూనే వినక తప్పదని అనుకొని వినడానికే ఉద్యుక్తుడయ్యాడు స్వామి.

ఇంతట్లోకి ఒక పన్నెండేళ్ల పిల్ల—పూలపరికిణి రంగు జాకెట్టూ వేసుకొన్న చామనచాయ పిల్ల ఆయన దగ్గరకు వస్తూ "నాన్నగారూ

రెండివ్వనన్నాడండీ—అణాకు ఒకటే ఇస్తాడట—పోనీ కొనుక్కోనా?" అన్నది బిక్క మొహం పెడుతూ.

ఆయన భుజంపైఉన్న కండువాతీసి ఒకసారి ఊరికే దులిపి మళ్లీ వేసుకొని "అబ్బ ఊరుకోవే. ఎప్పుడూ ఒకటే గొడవా. ఇదేం మన ఊరనుకొన్నావా గట్టిగా బేరమాడానికి—అప్పుజేసైనా కొనక్కొని తినడానికి — అయినా కాసేపు గొడవ చెయ్యక" అని ఆ పిల్లను కసురుకొని స్వామి వంక తిరిగి. "ఈ పిల్ల నా మూడో కుమార్తె అండీ" అన్నాడు సంతృప్తిని మందహాసంతో జతపరుస్తూ.

"అహా అల్లాగా అండీ" అన్నాడు స్వామి ఆవిషయం తనకేదో ఆనందం కలిగించినట్లు నటిస్తూ 'ఏమిటో ఈయన మరీ ఛాందసుడిలా ఉన్నాడు. ఈ పిల్ల మూడో కుమార్తె అయితే ఏం? కాక ఆరు దాటించిన సంతానమైతే ఏం? నాకెందుకు చెప్పడం?' అనుకొన్నాడు

స్వామి మర్యాదస్థునివలెనే ప్రవర్తించాలనుకొన్నాడు. నిజాని కతడు మరోలా ప్రవర్తించలేదు కూడాను

"మరేనండీ" అంటూ ఆయన మరో వాక్యం అరంభం చేశాడు తాపీగా. స్వామికి మనస్సులో వెళ్ళిపోదామనేఉంది. కాని ఉండి పోయాడు మర్యాదకు భంగం కనుగుతుందని. "పోనీతే ఓ పది నిమిషాలు ఇల్లా కాలక్షేవం అవుతుంది. ఇంతలో అతను ఇటే రావచ్చును. ఆతని ఇంటిదాకా వెళ్ళవలసినపని తప్పుతుంది" అని కూడా అనుకొన్నాడు స్వామి.

"దీన్ననలు రావద్దనే అన్నాను. కాదు కూడదని మారాం చేసి ఏడ్చి వెంటపడ్డది. ఒక దెబ్బ వేసివుంటే మాన్తుంది కానిండీ—

చెప్పద్దూ నాది కరుకుగుండె కాదండీ ... మా పెద్దమ్మాయి కొండపల్లిలో వుంటున్నది. పురిటికి తీసుకొనివద్దామని బయలుదేరాను. నిన్న రాత్రి జనతాలో బయల్దేరానండీ అని కొంచెం ఎక్కువసేపు ఆగాడా వ్యక్తి స్వామి వంక చూస్తూ.

"ఆహా—అయితే" అన్నాడు స్వామి.

చాలు చాలు మీరామాత్రం అన్నారా—ఇంకేం కావాలి చెప్పేస్తాను మరి మీరు సావధానంగా వినండి అన్నట్లుగా ముఖం పెట్టి సొంతమనిషితో చెప్పుకొన్నట్లే చెప్పడం మొదలు పెట్టాడాయన.

గుమ్మాలలోనే కూర్చుని లేవని ప్రయాణీకులను గురించీ,—బెంచీలమీద పరుపులు పరుచుకొని నిద్రలేవనంటే లేవనని పట్టు పట్టే వింత వ్యక్తులను గురించీ, ఆయన వివరంగా చెప్పి, తానా ప్రయాణంలో పడ్డ కష్టాన్ని సవిస్తరంగా చెప్పి చివరకు దాదాపు ముగింపుకువస్తూ "చూశారూ పవరుపేట దాటింది మరీ రద్దీ ఎక్కువ అయ్యింది. అమ్మాయయితే వెళ్ళి కాస్త చోటు చేసుకొని కూర్చుంది కాని నేను చివరంటా నిలబడేవచ్చాను. ఒకళ్ళ కాళ్లదగ్గర కూర్చోడమంటే నాకు మహా చికాకు. అందుకనే బెజవాడవచ్చే దాకా కళ్లు మూతలు పడుతున్నా, కాళ్లు నొప్పులు పడుతున్నా అల్లాగే నిలబడ్డాను తూర్పు తెల తెల వారుతుండగా బెజవాడ స్టేషన్ వచ్చింది. జాగ్రత్తగానే దిగాను. కాని పాడు జనం మనుష్యుల్ని సరీగా దిగనిస్తేనా. పిల్లను దిగనివ్వరే. రెండు చేతులూ ఎత్తి పిల్లనంది జొచ్చుకొని మెల్లగా దింపాను. నన్నొకప్రక్క తోస్తున్న మనుష్యుల్ని కాస్త అదమాయిస్తూ పిల్లను దింపాను. వెనక్కకు తిరిగాను అంతలో జ్ఞాపకం వచ్చి ప్రక్కజేబుపై చెయ్యి వేసుకొని చూచుకొన్నా. ఇంకేముందీ గుండె గుబేలుమంది. పర్సు లేదు—కనుమూసి తెరిచే

లోపలే ఎవరో ఎవరో గాని పర్సు కాస్తా కాజేశారు. అటూ ఇటూ చూశాను. ఎవరికైనా చెప్పుకొందామని నాలుగడుగులు వేశానో లేదో టికట్టు కలెక్టరు వచ్చిముందు నన్ను పట్టుకున్నాడు.

అయ్యోరామ పర్సుపోయిందయ్యా —ఉందవయ్యా బాబూ అంటే వినడే. పర్సు లేదు గిర్సూలేదు—ముందు టికెట్టు చూపు వేకపోతే డబుల్ చార్జి చెల్లించు" అంటూ వెంట పడ్డాడండీ

చూశారూ—ఆసమయంలో నేను పడ్డబాధ భగవంతునికికూడా అర్థం అయివుండదు. సిగ్గువిడిచి పెట్టి—అభిమానం చంపుకొని కాళ్లా వేళ్లావడి చెప్పుకోంగా చెప్పుకోంగా చివరకు పుణ్యాత్ముడు నమ్మి బయటకు వచ్చి విడిచిపెట్టి వెళ్ళాడు.

పోలీసులకు రిపోర్టు చేద్దామని ఎంతో అనుకొన్నా కాని ఏం లాభం? ఏదైనా మరో వస్తువయితే రిపోర్టు చేసినా అందం చందం. ఒకప్పుడు కాకపోతే ఒకప్పడయినా దొరుకుతుందనే ఆశ వుంటుంది. కాని డబ్బు డబ్బాఅందులోనూ ఈ రోజుల్లో పోయి దొరకడమా!" అని స్వామివంక చూచాడాయన. సానుభూతినీ సమర్థననూ కోరుతున్నట్లు. స్వామికి నిజంగా నే సానుభూతి కలిగింది.

"అయ్యో పాపం! అల్లాగా— అయితే పర్సు మొత్తం పోయిందన్నమాట! "అన్నాడతను.

"అవునండీ— మెల్లగా అంటారేం పోయిందని —డబ్బుపోవటం సంగతి అల్లా వుండగా పరాయి వూళ్లో అప్రతిష్ఠపాలయ్యాను. పోనీ ఈ పోవడం మా రాజమండ్రిలోనే పోతే—ఏదో ఒకతిట్టు తిట్టుకొని కాసేపు విచారపడి మనకు ప్రాప్తంలేని సొమ్ము దక్కదులే అని వూరుకొందును. కాని ఎరుగని వూరు ఏంచెయ్యటానికి తోచటంలేదు.

మరీ క్రొత్తచోటయిపోయిందండీ —ఎవరిని ఏమని అడగను చెప్పండీ! పైగా పిల్లదాన్ని వెంటేసుకొచ్చాను. ఒంటరిగాణ్ణయితే వెనక్కు వెళ్ళడానికి ఏదోతంటాలు పడేవాణ్ణేమో డబ్బులేకపోయినా—అబ్బే అదీ లాభం లేదు. ఎన్నడూ టిక్కట్టులేకుండా ప్రయాణం చేసిన వాణ్ణి కానుగా— ఎవరికైనా చెప్పు కొందామన్నా సిగ్గుగా వుంది. పోనీ చెప్పుకొన్నా నమ్మరుగదాఖర్మం—అదీ నిజమే. వాళ్లననవలసిన పనేముందీ రోజులు అటువంటివి." అని కాసేపు ఏదో గొణిగి మళ్లీ ఇల్లా అన్నాడు: "ఇంతకూ నా ఖర్మ ఇదంతా—లేకపోతే శుభమా అంటూ బయలు దేరిన పనేమిటీ—వంద రూపాయలూ పోగొట్టుకొని ఈ దారిద్ర్యం ఎమిటీ అని స్వామివంక దీనంగా సిగ్గుపడుతున్నట్లుగా తన్నుతాను నిందించుకొన్నట్లుగా —నిస్సహాయంగా చూచాడాయన. ఆ చూపుతో స్వామి కరిగిపోయ్యాడు. "నిజమేనండీ చిక్కులు ఎవరికైనా వస్తాయి. ఎంత జాగ్రత్తగావున్నా ఇలాంటివి ఎప్పుడో అప్పుడు తప్పవు—సరే ఇంతకూ ఏంచేద్దామనుకుకుంటూన్నారు." ఆ మాటకు ఆయన అందుకొని "అదేనండీ నేనూ ఆలోచిస్తున్నా-ఏమైనా వెనక్కు తిరిగి వెళ్ళిపోవాలి. ముందు పిల్లకు కాస్త తిండి సదుపాయం చూడాలి" ఆ పిల్లను దగ్గరకు తీసుకొని తల నిమురుతూ అన్నాడు.

అది చూచి స్వామి జాలిపడ్డాడు.

తాను విన్నదంతా నిజమేనని పించింది. పరాయ ఊళ్లో ఇలాంటి అవాంతరం వస్తే ఒకరుగాదు తాను మాత్రం ఏమి చెయ్యగలనా అని సందేహవడ్డాడు. అల్లా అనుకొనేసరికి అతనికి భయంవేసింది.

మరికొన్ని క్షణాలకు అతను తెప్పరిల్లుకొని "పోనీ మీ వాళ్ళకు వైరిస్తే!" అన్నాడు, తనకు సరిగా సమాయనికి సరియైన ఆలోచన వచ్చినందుకు తానే సంతోషిస్తూ. "అది మంచిపని—అదే చెయ్యాలి

ఇలాంటి పరిస్థితుల్లో—కాని ఒక్క చిక్కు వుందండీ ఇంట్లోనూ మాఆవిడ ఒక్కర్తే వుంది. మా రెండో అమ్మాయికూడా వుళ్లోలేదాయె-అదేమో ఒట్టి పల్లెకారు మనిషి—టెలిగ్రామ్ వస్తే ఫిట్ వచ్చినంత పనవుతుంది మాకిక్కడ ఏం జరిగిపోయిందో అని గాబరా పడిపోతుంది. పోనీ కాసేపు అయోనపడ్డా ఫరవాలేదులే అనుకొందామన్నా—అడది సమయానికి సొమ్ము దొరకడమెల్లా— ఒకవేళ దొరికినా అది పోస్టాఫీసుకువచ్చి డబ్బు కట్టగల తెలివితేటలెక్కడున్నాయి? అంత మాత్రం తెలివేవుంటే ఇంకేం" అని కాసేపేమేమో సంసార విషయాలు జ్ఞాపకం తెచ్చుకొని ఏన్కున్నాడు.

"ఒకవేళ ఎక్కడైనా అవస్థపడి తెస్తుందనుకొంటే—అది పంపడ మెప్పుడూ—ఆ సొమ్ము నాకు చేరడమెప్పుడూ—ఎంతలేదన్నా ఈ రోజు రేపుకూడా పడుతుంది. అసలీ రెండు రోజులూ ఈవూళ్లో ఈ పిల్లను పెట్టుకొని ఎల్లా గడపడం?" అన్నా డాయన

"అదీ నిజమేనండీ!" అన్నాడు స్వామి రెండు రోజులకూ వీరిద్దరికీ కనీసం ఎంత వ్యయమవుతుందో సుమారుగా లెక్క వేసుకొంటూ.

"అయితే తిరిగి వెళ్లమంటారు?" అని ఆగి, ఏదో ఆలోచనలో పడి మథనపడుతున్న ఆయన వంక చూస్తూ కాస్త పెద్దగా "పోనీ దగ్గరకనుక కొండపల్లి వెళితే?" అన్నాడు స్వామి.

"అబ్బే ఒట్టి చేతుల్తో అల్లుడి ఇంటికి వెళ్లడ మెల్లాగండీ—అసలే పిల్ల నిచ్చుకొన్న మామ అంటే ఈ రోజుల్లో చులకన అలాగా వెళితే—ఇంకెందుకూ" అని చప్పరించాయన.

స్వామి కిదీ నిజమేనపించింది. తన బావగార్ల విషయం జ్ఞాపకం వచ్చేసరికి ఆయన చెప్పింది సబబు అనిపించింది.

" అయితే ఇంకేం రాజమండ్రి వెళ్లండి-తప్పదుగా మరి-ఎంత అవుతుందండీ చార్జీ?" అని అడిగాడు స్వామి.

"ఆ—మా ఇద్దరికీ వెధవ రైలుచార్జే మూడు రూపాయలవుతుంది గదా-బాబ్బాబ్బా అడిగాననుకోక నాకీ సాయం చెయ్యండి మీ అడ్రసు ఇవ్వండి—క్కడికి చేరంగానే మీ పైకం మనిఆర్డరుద్వారా పింపంచి వేస్తాను. మీకు పుణ్యం వుంటుంది. కాస్త నా పరువు నిలబెట్టండి. పిల్లకు కానిని కాఫీ పోయించి ఎల్లాగో వుపవాసం చేయించి సాయంత్రం మూడు గంటల కోచీకి వెళ్ళిపోతా రేపు మీ డబ్బు వెంటనే పంపించి వేస్తా— మరొకర్నీ మరొకర్నీ సిగ్గువిడిచి అడగలేను — మీరూ" అని ఆగి స్వామి చేతులూ పట్టుకొన్నాడాయన ప్రాధేయపడుతూ.

స్వామికి చాలా సహజమైన సానుభూతి కలిగింది.

"సరే రండి—అలా వెళ్లి కాఫీతాగి వద్దాం" అని వాళ్లిద్దర్నీ వెంటపెట్టుకొని హోటల్‌కు వెళ్లాడు.

"అబ్బే నాకేందుకండీ—అంతంత మాత్రపు అకళ్లకు నాకేం పర్వాలేదు—అవేం వద్దులెండి" అంటూనే తెప్పించిన ఇడ్డెనలు నెమ్మదిగా తింటూ పిల్లచేత తినిపించాడు.

అపిల్ల అసలు మాటాడనేలేదు. ఏమిటో భయపడి పోయిన దానిలా చూస్తూ పల్లెకారు పిల్లలా దిక్కులు చూస్తూ తిని కాఫీ త్రాగి బుద్ధిమంతురాలిలా కూర్చుంది. స్వామికూడా వారితో పాటు కాఫీ త్రాగి బిల్లు సంతోషంగా చెల్లించి బయటకువచ్చి, ఆయనకు మొదట మూడు రూపాయలు ఇచ్చి మరో క్షణమాగి, "ఈ పిల్ల సాయంకాలంవరకూ ఎలాగో ఆగలేదు. కాసేపు వుండి శుభ్రంగా భోజనం పెట్టించేయండి" అని మరో రూపాయకూడా ఇచ్చాడు తాను సంతృప్తి

పొందుతూ "చూడండీ! మొత్తం నాలుగుముప్పావలా సరెసరె అసలు విషయమే మరచా మీ అడ్రసు తీసుకొన్నాను కాదె.

"ఆబ్బే ఇంతమాత్రానికి అడ్రసులూ — తిరిగి పంపడాలూ ఏమిటీ" అని కూడా 'పోనీ ఆయనవంవుతానన్నప్పుడు మనం వద్దనడం దేనికి" అనుకొని తన పూర్తి చిరునామా వ్రాసి ఇచ్చాడు. ఆయనా కాగితం భద్రంగా జేబులో పెట్టుకున్నాడు. ఒకటి రెండు సార్లు చదువు కొన్న తర్వాత "సరేగానండీ ఆ పై చిల్లర మాత్రం పంపకండి---అది కేవలం కాఫీకయిన ఖర్చు" అన్నాడు స్వామి.

"అబ్బెబ్బే అదేం వీల్లేదండోయ్—మీరు సమయానికి అడ్డుపడి ఆపద గడిపినందుకే నేనెంతో ఋణపడి వుంటాను. అదికాక రొఖ్ఖం కూడా బాకీపడివుండట మంటారా—ఒద్దు బాబూ వెంటనే పంపించి వేస్తాను. దయవుంచి పుచ్చేసుకోండి" అని ఆగి—

"రేపే పంపిస్తాను" అన్నాడు మళ్ళీ. రెండవసారి అన్న మాటలు చాల హుందాగా నెమ్మదిగా ఒక్కొక్క మాటే అన్నాడాయన. ఆవిషయంలో వారిద్దరకూ కొంత వివిదాం జరిగింది. చివరకు స్వామి "సరే మీ ఇష్ట మొచ్చినట్లే కానివ్వండి—- య్యో ఇంతకూ మీ పేరు అడగడం మరచాను" అన్నాడు. "నాపేరా—చెప్పాను అనుకొన్నా సుమండీ. నాగయ్య అంటారండీ. తమ రెప్పుడైనా అల్లా దయచేస్తే— ఎవర్నీ అడగక్కర్లేదు-సరాసరి వచ్చి నాళంవారి సత్రం దగ్గర దిగిపొండి దాని ప్రక్కవీధిలో—ఆ వీధి నేరుగా గోదావరి పోతుంది ఆ వీధివెంట నాలుగడుగులు ముందుకు వేసి కుడిచేతివైపు సందులో మొగదలోనే మా యిల్లు—ఆదే లెండి నేను అద్దెకుంటున్న ఇల్లు— ఆ ఇల్లు కొందామనే అనుకుంటున్నా గత రెండేళ్లనుంచీ. కాని ఎదో వీలుపడటం లేదు. తమరొక్కసారి రావాలి సుమండీ—జ్ఞాపకం వుంచుకొని—మీరు

రావాలేగాని మరెవర్నీ అడగనే అక్కర్లేదు" అన్నాడాయన స్వామివంక అప్యాయంగా చూస్తూ. స్వామికి సంపూర్ణ విశ్వాసం కలిగింది. తన జేబులో నుండి చిన్న నోటుపుస్తకంలో ఆయన చెప్పిన గుర్తులతో ఒక చిన్న మ్యాపుగీసి ఆయన పేరు—ఇంటి పేరుతోసహా వ్రాసుకొన్నాడు.

"అయితే మరి నేను" అని తన చేతి గడియారం వంక చూచుకొన్నాడు. తాను వెళ్ళవలసిన రైలుకు మరో అర్ధగంట మాత్రమే వ్యవధి వుంది. "అరెరె చాలా టైము గడిచిపోయిందే—మరి నేను వస్తానండీ" అని రిక్షా పిలిచి అందులో ఎక్కి కూర్చున్నాడు.

రిక్షా కదులుతుండగా ఆయన — నాగయ్య చిరునవ్వును ముఖమంతా ప్రయత్న పూర్వకంగా పరుచుకొని "మీ మేలు మాత్రం మరువతగినదికాదు సుమండీ" అన్నాడు.

"ఆ దాని కేముంది లెండి'' అని పోనీయవోయ్ అన్నాడు రిక్షా వాడితో స్వామి స్టేషన్ చేరుకొనేవరకూ చాల గర్వంగానూ తృప్తిగానూ కన్పించాడు తాను అంత ఉదాహరంగా ఒక పరాయి వ్యక్తిని కష్టకాలంలో అందుకొని సాయపడ్డందుకు.

కానీ మరో అరగంట ఆలస్యంగా వచ్చిన రైల్లో కూర్చున్న తర్వాత అతనికి క్రొత్త ఆలోచనలు వచ్చాయి. ఆయన చెప్పినదంతా నిజమేనా? అని ప్రశ్నించుకోవడంతో అతని ఆలోచన అరంభమయింది.

ఆ...తప్పకుండా నిజమే అయివుండాలి. కాకపోతే అన్ని మాటలు—అంత ఇదిగా చెప్పగలడా? అబద్ధాలాడితే ఒక మాటలో కాకపోతే మరో మాటలోనైనా పట్టివ్వడూ? నేనేమంత తెలివి తక్కువ వాణ్ణా వచ్చి అబద్ధాలు నమ్మడానికి!'' అని తర్కించుకొని సమాధాన పడ్డాడు.

పంపకపోతే

అల్లా జరగదు — పైగా అడ్రసు కూడా ఇచ్చాడుగా అది మాత్రం నిజమని నమ్మకమేమిటి?"

స్వామి నాయుడు మరలా ప్రశ్నపరంపరలో పడ్డాడు.

పొనిద్దూ పంపక పోయినా మరేం పెద్ద ప్రమాదం లేదు— నేనెన్నిసార్లు స్నేహితులతో సినీమాలకు వెళ్ళి ఆమాత్రం సొమ్ము ఖర్చుచేసుకోవడం లేదూ—పెద్ద మనిషి ఏదో ఆపదలోవుంటే కాస్త సాయపడ్డాను అదీ పెద్ద తప్పేనా? ఎవరో కొందరు మోసగాళ్ళు కొంత రమాయకుల్ని మోసం చేస్తుంటారని అందరు మనుష్యులూ అందర్నీ మోసం చేస్తుంటారని అనుకొంటామా? ఆ మాటకువస్తే మొన్న మామ గారింట్లో ఏ మైండీ ఆవరంగలు నుండి వచ్చినాయన—వైద్యం చేయించుకొని కన్ను నయమైన తరువాత వెళ్ళిపోతూ ఏం చేశాడూ?

అయ్యో డాక్టరుగారూ మీ దయవల్ల నా నాకంటి జబ్బు నయమైంది. అనుకొన్నట్లుగా ఫీజు ఇద్దామనే అనుకొన్నా కాని తెచ్చు కొన్న డబ్బుకాస్తా ఇల్లా అయ్యింది. చుట్టాల ఇంట్లో పర్సుకాస్తా మాయమైపోయింది. అదెవరో పరాయివాడే కనిపెట్టి చేసిన పని అని నాకు నమ్మకం. మా వాళ్లతో ఆ మాట గనుక అంటే వాళ్లకేమి కోపాలు వస్తయ్యో అని భయపడి వూరుకొన్నా. మీకు నేను పాతికరూపాయలు ఇవ్వవలసి వుంది. మీకు నాపై నమ్మకంవుంటే నన్ను మా వూరు వెళ్ళనివ్వండి. అక్కడికి చేరుకోగానే పైకం పంపించి వేస్తాను. కాదంటారా ఈ వుంగరం తమ దగ్గర వుంచండి—నేను మళ్లీవచ్చి విడిపించుకొని వెళతాను" అన్నాడు.

అప్పుడు మరి మామయ్య—నీకంటే చదువులో, అనుభవంలో చాలా పెద్దవాడేగా. ఏమాత్రమైనా సంకోచించారా? "అబ్బే అవేం

మాటలండీ, మీరు సంతోషంగా వెళ్ళిరండి. వెళ్లాక వీలునుబట్టి పంపండి మరేం తొందరలేదు" అని చెప్పి పైగా అక్కడ వాడ వలసిన మందులుకూడా ఇచ్చి పంపారు.

ఆయన వెళ్లిన పది రోజులకు కృతజ్ఞతను తెలుపు కొంటున్న ఉత్తరంతోపాటు మనిఆర్డరుకూడా వచ్చింది.

అంతే మనుష్యుల్ని నమ్మాలి.

నమ్మకం లేకపోతే ఎల్లాగా!

ప్రపంచంలో చాలమంది మంచివాళ్లే ఉంటారు.

స్వామి సానుభూతితో, మనుష్యులయందు అనురాగంతో దగ్గరి వాళ్ళ అనుభవాలు ఆధారంగా—ఆలోచన చేశాడు.

అందువల్లనే చివరకు అతను తాను చేసిన పని సబబే నని నిశ్చయానికి వచ్చాడు. అల్లాకాక నేను మరోలా ప్రవర్తించివుంటే నాలో దాక్షిణ్యమనేదీ, కనీసం ధర్మం అనేదీ లోపించిందనే చెప్పు కోవాలి అనికూడా అనుకొన్నాడు.

అల్లాగా అనుకోవడంతో అతనికి ఒక క్రొత్త ఆనందం—నూతనోత్సాహం కలిగినాయి.

ఆ కలిగిన తృప్తి—ఆ ఉత్సాహం అతనిలో రెండు రోజుల వరకూ నిలిచిఉన్నాయి. స్వామి సరాసరి చీరాల వెళ్లి తండ్రితో మాట్లాడవలసిన విషయాలు మాట్లాడి వచ్చేటప్పుడు "ఈ సారైనా మూర్తిని తప్పక కలుసుకోవాలి" అనుకొంటూ మూడు రోజులు తర్వాత బెజవాడలో బండి దిగి స్టేషన్‌లోగానీ—స్టేషన్ బయటగానీ ఎక్కువ ఆలస్యం చేయకుండా చరచరా మూర్తి ఇంటికి దారితీశాడు. తొందరగా వెళదామనుకొన్నా కూడా అతను నడిచే బయలుదేరాడు.

చేతిలో పెద్దసామాను ఏమీ లేనప్పుడు, అట్టే అర్జంటు పని లేనప్పుడు స్వామి రిక్షాలు, జట్కాలూ ఎక్కడు.

అప్పటికి సాయంత్రం అయిదు దాటుతోంది. ఆఫీసులనించి వచ్చేజనం మెల్లగా ఆఫీసర్ల పైవాళ్ళ ఆశీర్వాదాల్ని తలచుకొని భారంగా నడిచివస్తుంటే సినీమాలకు పోయే జనం తొందర తొందరగా త్రోసుకొంటూ రాసుకొంటూ పోతున్నారు.

స్వామి హోటళ్ళు—దుకాణాలు దాటి వడి వడిగా ఆ వీథి వెంట సత్యనారాయణపురం వైపుకు నడిచాడు.

కేకినీమహల్ ఎదురైంది. పోనీ కాఫీ త్రాగుదామా అనిపించింది. ఇప్పుడే ఎందుకులే అతనితో కలిసి ఎల్లాగో తాగుతానుగదా అని మళ్ళీ అనుకొన్నాడు.

"ఇదో పాడు అలవాటు. అనుకోకుండానే అటు వైపుకు ఎల్లా లాక్కుపోతుందో చూశావా," అని ప్రశ్నించుకొంటూ ఆ హోటల్ వైపే పరధ్యానంగా చూస్తూ కొన్ని అడుగులు మెల్లగా వేశాడు, అతనొక్క క్షణం ఆగిపోయాడు.

హోటల్ నుండి మెట్లు దిగి వస్తున్న ఆ పిల్ల కన్పించింది.

దుస్తుల రంగు మారింది.

స్వామి కొంచెము ప్రక్కకు జరిగి ఆగి చూచాడు. ఆ పిల్ల బాగా గుర్తుకు వచ్చింది.

ఆయన కూడా వచ్చాడంతలోనే. బయటకు వచ్చి సిగరెట్టు త్రాగుతూ మరో యువకునితో ఏదో మాట్లాడుతున్నాడు.

స్వామి ఒక్క క్షణం నిదానించి చూచాడు ఆయన వేసుకొన్న సిల్కుచొక్కా వంకా—ఆయన సిగరెట్టు పీలుస్తున్న తీరువంకా,

స్వామి మొదట ఆశ్చర్యపడి పోయాడు. అంతలో మండిపడ్డాడు. పర్సు పారేసుకొన్న రాజమండ్రి పెద్దమనిషి దీనంగా తన్ను యాచించిన ఘట్టం స్పురణకు వచ్చింది.

తాను నమ్మి వెంటనే సాయపడ్డాడు. అది కనీస ధర్మమని—తాను న్యాయంగా ప్రవర్తించానని—గర్వపడ్డాడు. అదంతా కేవలం మోసమని అనిపించేసరికి అతనికి కోపం వచ్చింది.

తను అవమానింపబడ్డట్టు అనిపించింది. కొంచెం జీరకన్పిస్తున్న కళ్లతో ఆయనవంక మరల చూచాడు.

ఆయన సిల్కుచొక్కా మెరుస్తూ కన్పించింది. సిల్కు చొక్కాలు వేసుకొనే మొగవాళ్లంటే ఆతనికి వస్తుతహా కోసం. ఏదో సరదాపడి ఆడవాళ్ళు కట్టుకోవల్సిందేగాని మగవాళ్లకు అటువంటివి పనికిరాదని అతని సిద్ధాంతం. తన మిత్రులు ఎవరు అల్లాంటివి — కొంటామన్నా కొన్నా-అతను వద్దని వాదించి, మరింత సన్నిహితులైతే తిట్టి, వాళ్ళను తన వైపునకు త్రిప్పుకొంటాడు.

"ఆ ఆ. అతనే—ఇంకా అనుమానం దేనికి?" అని పైద్దగానే అనుకుంటూ కొంచెం వేగంగా ముందుకు నడిచి వెళ్ళాడు. అతను వెళ్ళిన తీరు చూస్తే కోపం—అవమానం అనే రెండు ప్రవాహాలు వెల్లుబికి వచ్చి ఒక తావున కలిసి—ఒకదాన్ని ఒకటి ఢీకొని దెబ్బమోవుగా తగలడంతో స్తంభించిపోయి వెర్రెత్తి ముందుకు పరుగెత్తినట్లుగా ఉంది. కాని అతను తీరా ఆయన దగ్గరకు వెళ్లేసరికి అతనికి మర్యాద ఒకటి అడ్డు వచ్చింది.

"ఏం క్షేమమా అండీ?" అని మాత్రమే అనగలిగాడు—కోపాన్ని ఒక తెచ్చికోలు చిరునవ్వుతో కప్పి పుచ్చాలని వ్యర్థ ప్రయత్నంచేస్తూ.

ఆయన ఏదో మాటాడబోయి—మనిషిని గుర్తు తెచ్చుకొని కాస్త జంకాడు.

మంచి బలాఢ్యుడులా కన్పిస్తున్న ఆయన ప్రక్కనున్న యువకుడు వారిద్దరివంక నిదానంగా ఏమిటిది? అన్నట్లు చూచాడు.

స్వామి కోపంతో సరిగా మాట్లాడలేకపోయాడు. "ఏం తమరు రాజమండ్రి వెళ్ళనేలేదా — పోయిన పర్సు మళ్లీ...!" అని ఆగి పోయాడు.

ఆయన సిల్కులాల్చీ జేబులో బరువుగా వేలాడుతున్నట్లున్న పర్సు స్వామిని వెక్కిరిస్తున్నట్లు తొంగి చూచింది.

ఆయన జేబుమీద చెయ్యిపెట్టుకొని "ఎవరబ్బాయి నువ్వు?" అని ఏమీ తెలియనట్టే అడిగాడు—మెల్లగా హుందాగా.

స్వామి గభీమని ఆయన చొక్కా పట్టుకోబోయి —అంతలో తమాయించుకొని "నన్ను మీరసలు ఎరుగరు కదూ? మూడురోజుల క్రితం నాదగ్గర నాలుగు రూపాయలు మోసంచేసి కాజెయ్యలేదుకదూ?"

ఆయన ఆశ్చర్యపోతున్నట్లు చూస్తూ "నా కేమీ అర్థం కాకుండా మాట్లాడుతున్నావే—ఏమిటీ?" అని అతను చూడకుండా వెంటఉన్న యువకుని వంక ఓరగా చూచాడు.

స్వామికి కోపం పట్టరాని దయ్యింది.

"తెలిసేటట్టు చేస్తాను" అని ముందుకు రాబోయ్యాడో లేదో ఆ యువకుడు స్వామిని అడ్డుకొని అసలు సంగతేమిటో నాకు చెప్పండి అంటూ ప్రక్కకు తోసుకొని వెళ్లుతున్నాడు అంతలో అక్కడ ఒక రిక్షా ఆగింది.

"ఒరేయ్ ఏమిట్రా" అంటూ మూర్తి వెంటనే రిక్షాలోనుంచి దిగి స్వామిని విడిపించి ఒక్క మాటైనా మాటాడకుండా చెయ్యి పుచ్చుకొని చరచరా లాక్కుని వెళ్ళి రిక్షాలో కూర్చుపెట్టి తానూ ప్రక్కగా కూర్చుని అతను జేబులు తడిమాడు.

ఏం పర్సా? అదిలాగు జేబులో వుందిలే అన్నాడు. అని పర్సు ఉన్న జేబువంక చూచుకొన్నాడు. అది బయటకు వ్రేలాడుదోంది. ప్రయాణంలో జాగ్రత్త కోసం పిన్నీసు పెట్టడంవల్ల బయటకు వచ్చినా జారిపడక వ్రేలాడుతోంది.

మూర్తి ఆ విషయం గ్రహించి చిరునవ్వు నవ్వి "పోనీయినోయ్ కాస్త వేగంగా పోనీయ్" అన్నాడు రిక్షావాడితో.

స్వామి నాయుడు కాసేపు మూతిముడుచుకొని కోపంగా చూస్తూ కూర్చున్నాడు. ఏమీ మాటాడ బుద్ధి పుట్టలేదు. చివరకు ఉండబట్టలేక అనేశాడు "రెండు తగిలిస్తే బాగుండేది" అని.

మూర్తికి మాట్లాడడం కష్టమనిపించింది. స్వామికి అనుభవంలేదు పోయిందేదో పోయిందని వూరుకోక నడిబజార్లో వాళ్ళతో తగాదా పెట్టుకొన్నాడు. ఆ రకం మనుష్యులతో జట్టీ పెట్టుకొని నెగ్గడం మన తరమా! ఇంకా కాసేపు ఉంటే ఎంత ఆగడం జరిగేదో! ఇదీ అతని ఆలోచన.

మూర్తి వాళ్ల ఇల్లు సమీపించేదాకా ఇద్దరూ మౌనంగానే గడిపారు.

కాఫీలు త్రాగుతున్నప్పుడు నిదానంగా చెప్పాడు మూర్తి "చూచావ్ స్వామి వాళ్లు మంచివాళ్లు కాదు. వాళ్లకు బుద్ధి చెప్పేటంత బలం మన దగ్గర లేదు పరువు కాపాడుకోవడం కోసం మనమే తప్పుకోవాలి.

వాళ్ల కిది క్రొత్త కాదు వాళ్ల వృత్తే ఇది". మూర్తి వివరంగా ఆవిషయం విశదపరిచాక స్వామికి కోపం తగ్గింది. మరుక్షణంలో క్రొత్త విచారం కలిగింది. తాను చదువూ సంధ్యాలేని ఒక అనామకుడి వలన మోసగింపబడినదానికంటే తన తోటివాడు మూర్తికి ఉన్నంత సమయస్ఫూర్తి తనకు లేకపోయినందుకే ఆ విచారం. అందువల్లనే సరిగ్గా సమయానికి దైవికంగా అక్కడకు వచ్చి తానింకా అవమానింపబడకుండా ఆదుకొన్న మిత్రుని హృదయపూర్వకంగా అభినందించలేక పోయాడు స్వామినాయుడు.

---